క్లుప్తంగా

లక్కిరెడ్డిపల్లెలో నిమజ్జన సందడి


నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని టౌన్ పరిధిలోని వినాయక విగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ కమిటీ నిర్వాహకులు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. సీఐ వెంకట కొండా రెడ్డి, ఏఎస్ఐ రవీంద్రబాబులు వారి సిబ్బందితో కలిసి వినాయక నిమజ్జనం ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని దొరి చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రూ.1.93లక్షలకు గణేష్ లడ్డూ


లడ్డూ దక్కించుకున్న రెడ్డిశేఖర్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం రెడ్డీస్ కాలనీలో ఉన్న రామాలయం వద్ద అగ్రగామి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఇందులో రూ.1.93 లక్షలకు మద్దిరేవుల రెడ్డిశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు అభినందించి సన్మానించారు.

65 మద్యం బాటిళ్లు పట్టివేత


పోలీసుల అదుపులో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి, మద్యం బాటిళ్లు

సిద్దవటం : మండలంలోని ఎస్.రాజంపేట క్రాస్ వద్ద ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 65 మద్యం బాటిళ్లను పట్టుకొని వెంకట సుబ్బయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. మద్యం అక్రమంగా రవాణా జరుగుతోందనే సమాచారంతో తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతి లేకుండా 65 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి నుంచి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

టిప్పర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న మావులూరి విశ్వనాథ్

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : టిప్పర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐసీసీటీయూ జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్ అన్నారు. ఆదివారం రామాపురం మండలం గువ్వలచెరువులో టిప్పర్ డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్లకు తక్కువ వేతనాలు ఇవ్వడం చాలా దారుణమన్నారు. తక్షణమే టిప్పర్ల యాజమాన్యం డ్రైవర్లకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల టిప్పర్ల డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ.వెంకటరమణ, మండల కార్యదర్శిగా వి.మనోహర్, గౌరవాధ్యక్షులుగా మావులూరి విశ్వనాథ, ఉపాధ్యక్షులుగా ఎం.సెల్వనిత్యపూజ, కోశాధికారిగా శశికుమార్, సహాయ కార్యదర్శిగా జి.రామక్రిష్ణ, కమిటీ సభ్యులుగా ఓబులేసు, చంద్రశేఖర్, రామక్రిష్ణ, మహేష్, మహేంద్రలను ఎన్నుకున్నారు.

మహమ్మద్ ప్రవక్తను ప్రతి ఒక్కరూ అనుసరించాలి


మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను వివరిస్తున్న ముఫ్తి మసూమ్ సాహెబ్

లక్కిరెడ్డిపల్లి : జమియతే ఇత్తేహాదుల్ హింద్ లక్కిరెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త సల్లాలాహు అలైహి వసల్లం జీవిత చరిత్రపై ఆదివారం జల్సా కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లిలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా జమియతే ఉల్మా హింద్ జనరల్ సెక్రటరీ ముఫ్తి మసూమ్ సాహెబ్ హాజరయ్యారు. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కాగా షేక్ కలిముల్లామొదటి బహుమతి, ద్వితీయ బహుమతి షేక్ మహ్మద్ గౌస్, తృతీయ బహుమతి షేక్ అలీ ఇస్రా సుల్తానా నిలవగా సర్టిఫికెట్లను సీఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు అందజేశారు.

అన్నంపెట్టే రైతులపై చంద్రబాబు రాక్షసత్వం


రాజంపేట టౌన్: అన్నదాత పోరు పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి


వీరబల్లి: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- 9న అన్నదాత పోరుకు తరలిరండి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపు

రాజంపేట టౌన్ : సీఎం చంద్రబాబునాయుడు రైతన్నలపై రాక్షసత్వం ప్రదర్శిస్తున్నాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9వ తేదీ జిల్లా కేంద్రమైన రాయచోటిలో తలపెట్టిన అన్నదాత పోరు పోస్టర్‌ను ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉండటంతో రైతన్నలు సకాలంలో పంటను వేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కోసం రాష్ట్రంలోని రైతులు క్యూలో నిలబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. రైతులకు దక్కాల్సిన యూరియా, ఎరువులను కూటమి పార్టీల నాయకులు కృత్రిమ కొరతను సృష్టించారని ఆరోపించారు. ఆర్‌బీకేల ద్వారా యూరియా, ఎరువులను ఎందుకు పంపిణీ చేయడం లేదో సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ప్రకృతి కూడా సహకరించడం లేదని, దీనికి తోడు ప్రభుత్వ సహకారం కూడా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో యూరియా, ఎరువులను గత ప్రభుత్వంలో కంటే ఎక్కువగా ఇస్తున్నట్లు సీఎం, మంత్రులు చెప్పడం దుర్మార్గమన్నారు. రైతులకు ఎరువులు ఇస్తే రైతులు గంటల తరబడి క్యూలో ఎందుకు నిలబడుతున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించాలని వివిధ రూపాల్లో ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోలేదని, అందువల్లే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపుమేరకు ఈనెల 9వ తేదీ జిల్లా కేంద్రమైన రాయచోటిలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రైతులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కెవి.వెంకట సుబ్బయ్య, వివిధ విభాగాల ప్రతినిధులు వడ్డే రమణ, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, వరదరాజు, మిరాల్యాల సురేఖ, నాగా శేఖర్‌రెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, జీవీ సుబ్బరాజు, దండు గోపి, ఖాజా మొహిద్దీన్, జాహీద్ అలీ, బుర్రు సురేంద్ర, బొజ్జా పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయాలి

వీరబల్లి : ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీ మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రాంతంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీరబల్లి మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరనాగిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తాటిగుట్ల అమర్నాథ్ రెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం వారు మండల కేంద్రంలోని ఎంపీపీ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమంలో మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గత 14 నెలలు కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ పంటకూ గిట్టుబాటు ధర ప్రకటించలేదని, ఖరీఫ్ సాగు అవసరమైన యూరియా, విత్తనాలు సకాలంలో అందజేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బ్లాక్ మార్కెట్‌లో ఎరువుల అమ్మకం ఎక్కువగా జరగడం వలన రాష్ట్రంలో రైతులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల మంచి కోరే పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమేనని ఈ సందర్భంగా నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మునిరాజు, సర్పంచ్‌లు నాగిరెడ్డి, గోపినాథ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు నరేష్ స్వామి, నాయకులు కొండూరు సుబ్బరామరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ జగజ్జనని రేణుకా ఎల్లమాంబ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి నరసింహరాజు మాట్లాడుతూ దసరా ఉత్సవాలలో ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకారాలతో దర్శనమిచ్చే విధంగా గ్రామ పెద్దలు సహకారంతో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.


సిద్దవటం: పూజలందుకున్న రేణుకా ఎల్లమాంబ

నాగారపమ్మ ఆలయంలో..

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మను ఆదివారం ఉదయాన్నే పూజారులు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.


సుండుపల్లి: ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

మూతపడ్డ ఆలయాలు

సంబేపల్లె : మండల పరిధిలోని పలు ఆలయాలు మూసివేసినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం రాత్రి చంద్ర గ్రహణం సందర్భంగా మండల పరిధిలోని ప్రధానమైన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ, మోటకట్ల వెంకటశివసాయి ఆలయం, పశుపతినాథ ఆలయం, అడవికమ్మపల్లె శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, గుట్టపల్లె ఆంజనేయ స్వామి, దుద్యాల కొత్తపురమ్మ, పాలలబండ శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాలు మూసివేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం తిరిగి దర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.


సంబేపల్లి: మూతపడ్డ నల్లగంగమ్మ ఆలయం

రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని ఎండగట్టాలి


పోస్టర్‌లు విడుదల చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : అధికారం చేపట్టాక రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ఎండగట్టాలని ఆదివారం వైఎస్సార్సీపీ మండల అధ్యక్షులు, వైస్ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 9వ తేదీన రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగే అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేయడం వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. పెట్టుబడులకు అప్పులు చేసి పండించిన ఏ ఒక్క పంటకూ ధరలు లేక రైతులు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా వారి జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మి ఓట్లు వేసిన పాపానికి రైతులకు తిప్పలు తప్పడంలేదని ఎద్దేవా చేశారు. రైతులకు అండగా ఈనెల 9న జరిగే అన్నదాత పోరు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, నంద బాల, గునిశెట్టి రమేష్, శంకరయ్య, డీవీ రమణ, శివయ్య, చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, రఫీ, రఘు, క్రిష్ణారెడ్డి, బండారు మల్లి, ఆంజనేయులు, ఫరూక్, ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులు

మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్ : కాలానుగుణంగా వచ్చిన మార్పుల కారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పోలావారి కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం తిరుపతికి చెందిన వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పోలా శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వెంకటరమణ హాస్పిటల్‌కు చెందిన వైద్య బృందం రాజంపేట ప్రాంత ప్రజల కోసం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎక్కడ నిర్వహించినా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చాలా మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమకు ఆరోగ్య సమస్యలు ఏవీ లేవని ఆసుపత్రికి వెళ్లారని, అయితే ఒక వయస్సు వచ్చిన తరువాత కొన్ని వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయించుకొని ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుంటుండాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఎక్కడ నిర్వహించినా ప్రజలు విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మనిషికి ప్రధానమైనది ఆరోగ్యమని తెలిపారు. కోట్లాది రూపాయలు, కోట్లు విలువ చేసే ఆస్తులున్నా ఆరోగ్యం బాగాలేకుంటే మనిషి ఆనందకరమైన జీవనం సాగించేందుకు ఉపయోగపడవన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు అందరిది ఉరుకులు, పరుగులమయమైన జీవనమైందని, అందువల్ల తీసుకునే ఆహారం వంటి విషయాల్లో కూడా శ్రద్ధ చూపాలన్నారు. ఎన్ని పనులు ఉన్నా నిత్యం కనీసం ఒక గంట అయినా వ్యాయామాలకు సమయం కేటాయించుకోవాలని తెలిపారు. వెంకటరమణ హాస్పిటల్స్ వారు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు విరివిగా నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఇదిలావుంటే ఈవైద్య శిబిరంలో దాదాపు 350 మందికి పైగా రోగ్యులు పాల్గొని వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. రోగులకు వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సి.వెంకటరమణ, డాక్టర్ నిరూపమ, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్ రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే చంద్రబాబుకు చిన్నచూపు

రాయచోటి టౌన్ : కూటమి ప్రభుత్వానికి ముందు చూపు లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్ ఆరోపించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయలంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుకు ముందు నుంచి రైతులంటే చిన్న చూపేనన్నారు. వ్యవసాయం దండగని గతంలో అనేక సార్లు చెప్పేవాడని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. గత ఏడాదంతా అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఈ సారైనా పంట సాగు చేద్దామని సిద్ధమైన రైతులకు కూటమి ప్రభుత్వం ఎరువుల కొరత సృష్టిస్తోందన్నారు. రూ.260లు అమ్మాల్సిన యూరియాను రూ.350 నుంచి రూ.400లకు విక్రయిస్తూ రైతులను దగా చేస్తున్నారన్నారు. రైతులను నిండా ముంచుతున్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఈశ్వర్ ప్రసాద్, బుజ్జిబాబులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

మహిళా సాధికారతకు నిరంతర పోరాటం

రాయచోటి టౌన్ : మహిళల సాధికారత, సమానత్వం కోసం నిరంతరం పోరాటం సాగించాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా మహిళా సంఘం అధ్యక్షులు సరోజమ్మ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వరకట్న వేధింపులు, భర్త చేతుల్లో హింసలకు గురవుతున్నారని తెలిపారు. రోజుకు 34 మంది ఏదో ఒక పేరుతో బలవుతుండటం దౌర్భాగ్యమన్నారు. అయితే నేరం రుజువై శిక్షలు పడుతున్నది కేవలం 23.5 మందికి మాత్రమేనన్నారు. లింగ సమానత్వ సూచిక ప్రకారం అంతర్జాతీయంగా భారతదేశంలో 108/193 మంది ఉన్నారన్నారు. ఇది సమానత్వం సాధించడానికి 2058 వరకు సమయం పట్టే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మద్యాన్ని నియంత్రిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడే మద్యం అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మహిళా నాయకురాళ్లు లక్ష్మీదేవి, రత్నమ్మ, ప్రమీళ, పద్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటి టౌన్ : కడప నగరంలో ఈ నెల 12, 13, 14వ తేదీలలో నిర్వహించనున్న ఏఐఎస్‌బీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని అఖిల భాతర విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్దన్ పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి రూరల్ పరిధిలోని బీసీ హాస్టల్‌లో ఆ సంఘం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నది విద్యార్థి సంఘాలేనన్నారు. అలాంటి విద్యార్థి సంఘాల నాయకులు నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, అఖిల్, ప్రణయ్, కిరణ్, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు పెట్టి ఉద్యమాలు ఆపలేరు


సీహెచ్ చంద్రశేఖర్

ఓబులవారిపల్లె : కష్టపడి పంటసాగు చేసి నష్టం వచ్చి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఏర్పడితే వారికి అండగా ఉండి పోరాటం చేస్తే కేసులు నమోదు చేస్తారా అని అన్నమయ్య జిల్లా సీఐటీయూ అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం పోరాటాలు చేస్తున్న నాయకులపై అక్రమ కేసులతో బెదిరించడాన్ని తప్పుబడుతూ విలేకరులతో మాట్లాడారు. దళారులు కుమ్మక్కై రైతుల కష్టాన్ని దోచుకుంటుంటే పోరాటం చేసినందుకు పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడాన్ని ఖండించారు. కలెక్టర్ ఆదేశించిన ధరకు కాకుండా దళారులు అందరూ కుమ్మక్కై ఐదు రూపాయలకు ధర నిర్ణయించడం పట్ల రైతులకు అండగా ఉండి వారితో కలిసి పోరాటం చేసినందుకు వారి మోసాలను, దోపిడీని బయటపెట్టినందుకు తనపై కక్ష సాధింపు చేస్తున్నారని పేర్కొన్నారు. పోరాట ఫలితంగానే కిలో బొప్పాయి ధర రూ.8కి పెంచుకోగలిగారన్నారు. కేసులు పెట్టినంత మాత్రాన పోరాటాలను అణచివేయలేరని స్పష్టం చేశారు. రైతులను మోసగిస్తున్న దళారులపై, సేఠ్‌లపై కేసులు నమోదు చేయకుండా తనపై కేసు నమోదు చేయడాని ప్రశ్నించారు. 2019 వరకు ఉన్న లైసెన్సు విధానాన్ని పునరుద్ధరించాలని, దళారీ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ద్వారా రైతులకు అండగా ఉండి పోరాటాలను కొనసాగిస్తామని ఆయన తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీ ఎనిమిదో వీధిలో ఆదివారం తిరుపతి ఆస్త్రా నారాయణాద్రి ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులచే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు 60 మంది రోగులకు వివిధ రకాల జబ్బులకు సంబంధించి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో తల్లం భరత్‌కుమార్ రెడ్డి, గల్లా శ్రీనివాసులు, వైద్యులు పాల్గొన్నారు.

బడుల సమస్యలు తెలిపేదెలా?

- మూలనపడ్డ ఫిర్యాదు పెట్టెలు
- సమస్యలున్నా చెప్పుకోలేని విద్యార్థులు
- ఉన్నతాధికారుల దృష్టికి రాని ఇబ్బందులు

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకోవడానికి గతంలో ఫిర్యాదు పెట్టెలను అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఈ పెట్టెలు కొన్ని స్కూళ్లలో మూలనపడేయగా.. మరికొన్ని పాఠశాలల్లో అందరికీ కనబడేలా ఉండటంతో విద్యార్థులు వాటిలో సమస్యలపై ఫిర్యాదులు చేయలేకపోతున్నారు. ఒకవేళ సమస్యలపై ఫిర్యాదు చేస్తే ఉపాధ్యాయులో, ప్రధానోపాధ్యాయులు కక్ష కట్టి తమను ఎక్కడ ఇబ్బందులకు గురి చేస్తారోనన్న భయం విద్యార్థుల్లో నెలకొంది.



ఫిర్యాదుల పెట్టె నమూనా చిత్రం

సమస్యలతో సతమతం

పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమవుతున్నారు. మరుగుదొడ్ల వద్ద పారిశుధ్యం అంతంత మాత్రంగానే ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాల మేరకు ఉండటం లేదు. రుచికరంగా ఉండకపోవడంతో ఇంటి నుంచే భోజనాలు తెచ్చుకుని విద్యార్థులు తినాల్సి వస్తుంది.

ఉన్నతాధికారుల దృష్టికి రాని సమస్యలు

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి రావడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తాము కొన్ని పాఠశాలలను సందర్శించినప్పుడు కొందరు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తున్నారని, వాటిని తాము ఉన్నతాధికారులకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెబుతున్నారు.


ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు

కొన్ని పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్సును విద్యార్థులకు అందుబాటులో లేకుండా మూలనపడేశారు. మరికొన్ని పాఠశాలల్లో బాక్సులు ఉన్నప్పటికీ అందరికీ కనబడేలా ఉండటంతో ఫిర్యాదులు అందులో వేయడానికి విద్యార్థులు వెనుకాడుతున్నారు. తాము ఫిర్యాదులు వేసే సమయంలో ఎవరైనా గమనించి తమనే లక్ష్యం చేస్తారనే ఆందోళన వారిలో కనిపిస్తోంది. బాలికల విషయంలో జరిగే అసభ్య ప్రవర్తనలపై ఫిర్యాదులు చేయడానికి బాలికలు కూడా జంకుతున్నారు.

ప్రధానోపాధ్యాయుల వద్దే తాళాలు

కొందరు విద్యార్థులు తెగించి ఫిర్యాదుల పెట్టెలో ఫిర్యాదు వేస్తున్నప్పటికీ అవి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు వేసే ఫిర్యాదుల పెట్టె తాళాలు అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుని వద్ద ఉంచడమే దీనికి ప్రధాన కారణం. ఫిర్యాదు కాపీలను సదరు ప్రధానోపాధ్యాయులు తీసి చదివే అవకాశం ఉంటుందని, అతనిపై చేసే ఫిర్యాదు కాపీలను తొలగించే వెసులుబాటు కూడా ఉంటుందని చెబుతున్నారు. ఈ కారణంగా విద్యార్థులకు న్యాయం జరిగే అవకాశం లేకపోవడంతో పాటు వారిపై ప్రతీకార చర్యలు తీసుకునే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు.

తాళాలు ఎంఈఓల వద్ద ఉంచాలి



విద్యార్థులు నేరుగా ఫిర్యాదు చేయలేని అనేక సమస్యలను ఫిర్యాదుల బాక్సుల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. పెట్టెల తాళాలు ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీఓల వద్ద ఉంచాలని తీసుకున్న నిర్ణయం సరికాదు. ఫిర్యాదుల పెట్టెల తాళాలు ఎంఈఓల వద్ద ఉంచాలి. బాక్సులను ప్రతి వారంలో రెండుసార్లు తెరిచి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

– తుమ్మల లవకుమార్, ఏఐఎస్‌ఏ విద్యార్థి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి